ప్రజాశక్తి
సోమవారం 10 మార్చి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

హామీలు 'పదిలం'..!

- ఎన్నికలకు ముందు చెప్పిందే ఇప్పుడు కూడా..
- వెలిగొండ.. మార్కాపురం జిల్లాపై కొత్త మాటేదీ?
- చంద్రబాబు పర్యటన వల్ల జిల్లాకు ఒనగూరింది శూన్యం..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఏం చెప్పారో.. అధికారంలోకి వచ్చాక సిఎం బాధ్యతల్లో ఉన్న చంద్రబాబు ఇప్పుడూ అదే మాట చెప్పారు. అప్పుడూ ఇప్పుడూ మాటల్లో తేడా లేదు. వెలిగొండ పూర్తి.. మార్కాపురం జిల్లాను తానే చేస్తానని మరోసారి చెప్పారు. ఇందులో కొత్త మాటేమీ లేదు. అప్పుడూ ఇప్పుడూ ఇచ్చిన హామీలు పదిలంగా ఇంకెంత కాలం ఉండాలో చూద్దాం. అక్కడి జనం, రైతులు ఆయన గతంలో ఇచ్చిన హామీలకు కార్యాచరణ కోరుకుంటున్నారు. ఆశగా ఎదురు చూస్తున్నారు. జనం ఆశించిన కార్యాచరణే కనిపించలేదు. స్పష్టత అంతకన్నా లేదు. పురోగతి దాదాపుగా లేదు. కింకర్తవ్యం ఏమిటన్నది ఆ ప్రాంత నేతల్లోనూ ఉంది. అసలు చంద్రబాబు పశ్చిమ ప్రాంతంలో రోజంతా గడిపినా ఆ ప్రాంతానికి ఇప్పుడు ఒనగూరిందేమిటి? కనీసం ఏ సమస్యపైనైనా స్పందించారా? నిధులు ఇచ్చారా? అంటే ఏమీ లేదు. వైద్య కళాశాల కూడా గందరగోళంగా మారింది. దానిపైనా మాట మాట్లాడలేదు. అంతా పార్టీ పెద్దల దర్శకత్వంలో అధికారులు రచించిన స్క్రిప్ట్ నడిచింది. అధికారంలో ఎవరున్నా సిఎం ఎదుట నడపాల్సిన తతంగాన్ని అధికారులు నడిపారు. వాళ్ల తప్పేమీ లేదు. నేతలకు కావాల్సింది కూడా ఇదే.. వెలిగొండ ప్రాజెక్టుపైనా, మార్కాపురం జిల్లాపైనా ఆ ప్రాంత ప్రజానీకం స్పష్టత ఆశించారు. ఆయన మాత్రం దేనికీ ఇవ్వలేదు. ఎప్పటిలాగే వెలిగొండను తానే పూర్తిచేస్తాననే ▶ 3లో

ఫ్లోటింగ్ హార్బర్ స్థానంలో

లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్

- నిధుల కుదింపుల జాబితాలో 'వాడరేవు ఫిషింగ్ హార్బర్'
- 'రూ.450 కోట్ల' స్థానంలో రూ.150 కోట్లతోనే నిర్మాణం
- కొత్తపట్నం వద్ద రూ.392 కోట్లతో నిర్మించనున్న వైనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తరచుగా సంభవిస్తున్న తుఫానుల నేపథ్యంలో సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు నిరంతరం ఎదురయ్యే సమస్య తమ బోట్లను ఎక్కడ ఉంచాలి అనేది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సముద్రతీరంలో ఎక్కడ కూడా బోట్లను నిలిపి ఉండే సౌలభ్యం లేకపోవడంతో మత్స్యకారులు సుదీర్ఘకాలంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు కోరుతూ వచ్చారు. ఈ ప్రాంత మత్స్యకారులందరూ నిజాంపట్నం వెళ్లి అక్కడ తమ బోట్లను లంగరు వేస్తూ వస్తున్నారు. ఈ కష్టాల నుంచి తమని తప్పించాలని, చీరాల వాడరేవు, కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్లు నిర్మించాలని కోరుతూ వచ్చారు. కానీ చీరాల వాడరేవు ప్రాంత మత్స్యకారులను దశాబ్ద కాలానికి పైగా ఊరిస్తూ వస్తున్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఎప్పటికి ఒక కొలిక్కి వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కారణాలు ఏమిటో తెలియదు కాని ఫిషింగ్ హార్బర్ నిర్మాణ వ్యయాన్ని మూడో వంతుకు కుదించారు. రూ.150 కోట్ల అంచనాలతో లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 65 మత్స్యకార గ్రామాల్లో 54 వేల మంది మత్స్యకారులు సముద్రాన్ని నమ్ముకొని జీవిస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల బోట్లు కలిపి 2,986 వంకు ఉన్నాయి. సముద్రతీర ప్రాంతంలో ఉండే మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. ప్రతి రోజూ లోతైన సముద్రజలాల్లో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లు, మోటరైజ్డ్ బోట్లను సముద్రపు ఒడ్డున నిలిపి ఉంచేందుకు జిల్లా తీరంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, చీరాల వాడరేవుల్లో రెండు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలు జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు నిజాంపట్నం వద్ద రూ.450 కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతోంది. నిధుల కొరత కారణంగా కొంతకాలం పనులు నిలిచిపోగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండో దశ నిర్మాణ పనులు ప్రారంభించారు.

చీరాల వాడరేవులో రూ.450 కోట్లతో ఫ్లోటింగ్ హార్బర్ మంజూరయింది. 2023 మే 15న అప్పటి ముఖ్యమంత్రి ▶ 2లో

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ▶ 3లో

సమస్యల పరిష్కారానికే ప్రజాచైతన్య యాత్రలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజా చైతన్యయాత్రల ద్వారా జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని.. వాటి పరిష్కారానికి ఆందోళన చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. ఆదివారం పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ అధ్యక్షతన ▶ 2లో

మాట్లాడుతున్న రమాదేవి

'చలో రాజధాని'ని భగ్నం చేసేందుకు ఒత్తిళ్లు..

అంగన్‌వాడీలకు అధికారుల హెచ్చరికలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సోమవారం నాడు అంగన్‌వాడీల చలో రాజధాని కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు వారిపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. సోమవారం నాడు సెక్టార్ల మీటింగ్ పేరుతో సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని, లేనిపక్షాన టెర్మినేట్ చేసేందుకు వెనుకాడబోమని అధికారులు ఒత్తిడి పెంచినట్లు సమాచారం. కాగా నాయకత్వ శ్రేణుల్లో ఉన్న కార్యకర్తలపై పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిసింది. అంగన్వాడి సిబ్బంది, నాయకత్వంపై పోలీసులు ప్రత్యక్షంగా నిర్బంధం విధించనప్పటికీ సోమవారం నాడు ఆందోళన కార్యక్రమానికి ఎవరెవరు హాజరవుతున్నారని విషయంపై నాయకత్వ హోదాలో ఉన్న వారిని ప్రశ్నించి... వివరాలు రాబడుతున్నట్లు సమాచారం తెలిసింది.

క్షేత్రస్థాయి నుంచి

విద్యావ్యవస్థ బలోపేతం

- ప్రతి క్లాసుకూ తప్పనిసరిగా ఒక టీచర్..
- విద్యా ప్రమాణాలు మెరుగుపరచటమే ప్రభుత్వ లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్

కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-రేపల్లె

కూటమి ప్రభుత్వ పాలనలో క్షేత్రస్థాయి నుండి విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఒక్క క్లాసుకు తప్పనిసరిగా ఒక టీచర్ ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదో తరగతి తర్వాత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కళాశాలలలో మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆధునిక సదుపాయాలు విశాలమైన తరగతి గదులు ఉంటే విద్యార్థులు ఉన్నతంగా రాణించే అవకాశం ఉందన్నారు. సౌకర్యవంతమైన విద్యాలయాలలో విద్యను అభ్యసించడం ▶ 2లో

ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్
ఉపాస్ హాస్పిటల్స్ రెండవ శాఖ ప్రారంభం
ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్
పేద మరియు మధ్య తరగతి ప్రజలకు మన ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్ నుండి డా॥ ఎన్.టి.ఆర్ వైద్య సేవలు ప్రారంభం
డా॥ ఎన్.టి.ఆర్ వైద్యసేవ — పేదలందరికి ఆధునిక వైద్యం
అత్యుత్తమ వైద్య సేవలు
✓కార్డియాలజీ ✓ఆర్థోపెడిక్స్ ✓జనరల్ సర్జరీ ✓న్యూరాలజీ ✓న్యూరో సర్జరీ
✓నెఫ్రాలజీ ✓అనస్థీషియా ✓పీడియాట్రిక్ సర్జరీ ✓పీడియాట్రిక్స్ ✓పాలీ ట్రామా
✓కార్డియో థొరాసిక్ సర్జరీ ✓జెనిటో యూరినరీ సర్జరీ ✓ENT (ఈ ఎన్ టీ)
24/7 అత్యవసర వైద్య సేవలు
మరింత సమాచారం కొరకు సంప్రదించండి:
7207950541 | 7207950542 | 7207950543
ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
నియర్ బచ్చల బాలయ్య కళ్యాణ మండపం, రైల్వే స్టేషన్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523001

వాడరేవులో లోకాస్ట్ హార్బర్

(మొదటిపేజీ తరువాయి)

జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. వాడరేవు సముద్రపు ఒడ్డున ఉన్న 19 ఎకరాల భూమిని హార్బర్ కోసం కేటాయించారు. గతంలోనే టెండర్ కూడా ఖరారైంది. హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తారని ఏడాదిన్నర కాలంగా చెబుతున్నారు. నాబార్డు నిధుల మంజూరుతో పాటు రాష్ట్ర వాటా నిధుల విడుదలలో జరిగిన జాప్యం కారణంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. వాడరేవులో రూ.450 కోట్లతో నీటిపై తేలియాడే విధానంలో నిర్మించే ఫ్లోటింగ్ జెట్టీ తరహా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగాల్సి ఉంది. కానీ రూ.150 కోట్ల అంచనాలతో లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఒంగోలు, కొత్తపట్నంలో 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు జీవో కూడా ఇచ్చారు. కానీ ఈ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలు పక్కన పెట్టి బాపట్ల జిల్లా నిజాంపట్నం, చీరాల వాడరేవుల్లో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం నూతన ప్రతిపాదనలు చేశారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ పనులు 70 శాతం అయ్యాయి. వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం మాత్రం నిలిచిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. ఈ మేరకు రూ.379 కోట్లతో హార్బర్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఇందుకోసం కేంద్రం రూ.150 కోట్లు, నాబార్డు నిధులు రూ.218 కోట్లు, రాష్ట్ర వాటా ధనం రూ.24.25 కోట్లు నిధులతో కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగనుంది. ఇటు నిజాంపట్నం, అటు కొత్తపట్నంలలో హార్బర్ల నిర్మాణం జరగనున్న నేపథ్యంలో చీరాల వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణ వ్యయాన్ని తగ్గిస్తూ లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరపాలనే నిర్ణయానికి పాలకులు వచ్చిట్లు భావిస్తున్నారు. ముందు అనుకున్న విధంగా రూ 450 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగితే దీనికి అనుబంధంగా ఒడ్డున చేపల వేలం కోసం ప్లాట్ ఫారాలు, ఐస్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజి యూనిట్, సోలార్ వ్యవస్థ, ఆయిల్ బంకు, పడవల మరమ్మత్తుల కోసం పెద్ద షెడ్లు అందుబాటులోకి వచ్చేవి. కానీ సవరించిన ప్రతిపాదనలు కారణంగా ఏ తరహా హార్బర్ నిర్మాణం జరుగుతుందో అర్ధం కాకుండా ఉంది. అసలు ఇందుకోసం నిధులు వస్తాయా లేక కొత్తపట్నంకు ఫిషింగ్ హార్బర్ వెళ్ళిపోతుందా.. అన్న సందేహాలు వస్తున్నాయి. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చీరాల వాడరేవులో పూర్తి స్థాయి ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై దృష్టిపెట్టాల్సి ఉంది.

క్షేత్రస్థాయి నుంచి విద్యావ్యవస్థ బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

వల్ల మంచి స్నేహితులు, విద్యాబోధన మెరుగైన కమ్యూనికేషన్ స్కిల్స్ అభివద్ధి చేసుకొని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మంచి లక్ష్యాలు సాధించేందుకు దోహదపడతాయన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలకు దీటుగా ప్రభుత్వ రంగ విద్యాసంస్థలను బలోపేతం చేసే దిశగా కషి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ విద్యారంగాన్ని అభివద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివద్ధికి పాఠశాల స్థాయి నుండి, కళాశాల స్థాయి వరకు ఉచితంగా పుస్తకాలు, బట్టలు, బ్యాగులు అందజేస్తున్నట్లు తెలిపారు. రానున్న విద్యా సవత్సరం ప్రారంభంలో మే నెల నుండి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించే క్రమంలో వివిధ కంపెనీలతో చర్చించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు బాధపడకూడదనే ఉద్దేశంతో మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేశామని చెప్పారు. ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అయ్యేందుకు, యువతకు కావలసిన సదుపాయాలు అందించేందుకు పేరెంట్, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పిస్తామని వాగ్దానం చేశారు. గతంలో సరైన సదుపాయాలు, బిల్డింగ్ వసతులు లేవని ఇక్కడి నుంచి వెళ్లిన వారు సైతం మరల ఇదే కళాశాలకు వచ్చే విధంగా కళాశాలను అభివద్ధి చేస్తామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలకు ఆకాంక్షలకు తగ్గట్టుగా ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కష్ణ, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళీధర్‌రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మంత్రి సోదరులు శివప్రసాద్, తాత ఏడుకొండలు, ఆర్డీవో రామలక్ష్మి, డి.ఎస్.పి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఎమ్మార్వో శ్రీనివాసరావు, మంత్రి వ్యక్తిగత సహాయకులు ధర్మతేజ, మీడియా కోఆర్డినేటర్ వేమూరి అజయ్ బాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 580/2023

బొంతా శ్రీనివాస రెడ్డి ..వాది

వర్సస్

ఈదుల విష్ణు వర్ధన్ రెడ్డి ..ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

ఈదుల విష్ణు వర్ధన్ రెడ్డి తండ్రి బలరామిరెడ్డి,
హిందూ, ప్రైవేట్ లెక్చరర్,
సుమారు వయస్సు 40 సం.లు,
డోర్ నెం 2-81-ఎ, నరవ గ్రామం,
గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది నీనుండి పరిహారం రాగోరి పై నెంబరు దావాను దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుటకు 10-03-2025వ తేదీ వాయిదావున్నది. కావున నీవు వాయిదారోజు ఉదయం గం. 10:30 ని.లకు పై కోర్టు నందు నీవు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై నీఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ పి.యస్.శేషశయనా రెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
అడ్వకేట్స్, గిద్దలూరు.

సమస్యల పరిష్కారానికే ప్రజాచైతన్య యాత్రలు

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలుచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజాచైతన్య యాత్రల ద్వారా ప్రధానంగా బాపట్ల జిల్లాలో స్థానిక సమస్యలు తెలుసుకొని అధికారులకు అర్జీల ద్వారా సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజల నివాస ప్రాంతాల్లో మంచినీళ్ల సమస్య, రోడ్లు, దోమల బెడద వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. టిడ్కో ఇళ్ల కోసం గత 5 ఐదేళ్ల క్రితం లబ్ధిదారులు డబ్బులు చెల్లించారని, ఇప్పటికీ అద్దెలు కట్టుకోక ఇబ్బందులు పడుతున్న వారికి టిడ్కో గహాలు వెంటనే పూర్తి చేసి ఇవ్వాలన్నారు. బాపట్లలో పెరుగుతున్న దోమలను అరికట్టి ప్రజల ఆరోగ్యం కాపాడాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన బాపట్ల జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయని, జిల్లాలో పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు ఉన్నారని చెప్పారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అధికార యంత్రాంగం పూనుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్ బాబురావు, సిహెచ్ మణిలాల్, కే శరత్‌బాబు, టి వెంకటేశ్వర్లు, ఎం ఆంజనేయులు, కొండయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No : 21/2024
in
O.S.No : 633/2022

శిరిపిరెడ్డి రామక్రిష్ణారెడ్డి ..డి.హెచ్.ఆర్

వర్సస్

కంచర్ల రాజు అలియాస్ పుష్పరాజు ..జె.డి.ఆర్

To,

జె.డి.ఆర్ చిరునామా

కంచర్ల రాజు అలియాస్ పుష్పరాజు
తండ్రి దాస్, వయస్సు సుమారు 53 సం.లు,
క్రిస్టియన్ హౌస్ నెం: 2-73, అంబవరం గ్రామం,
గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా,ఏపీ స్టేట్.

పై నెంబరు అమలు అర్జీలోని డిక్రీహోల్డర్ డిక్రీ పరిహారం రాగోరుచూ పై నెంబరు అమలు అర్జీని శ్రీకోర్టునందు దాఖలు చేసియున్నాడు. సదరు అమలు అర్జీలో నీవు పైకోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 13-03-2025వ తేదీ యున్నది. నీవు వాయిదా రోజు ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా గాని నీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్ష మందు సదరు అమలు అర్జీని విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 09-03-2025 ఇట్లు
శ్రీ బి.డి గిరి
శ్రీ తురగా ఈశ్వర అంజనీకుమార్.
అడ్వకేట్స్, గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 454/2024

మాసాని సుబ్బారెడ్డి ..వాది

వర్సస్

పర్వత వెంకట రామ మహేశ్వరరెడ్డి
వురఫ్ పి.వి.ఆర్. మహేశ్వరరెడ్డి ..ప్రతివాది

To

ప్రతివాది :

పర్వత వెంకట రామ మహేశ్వరరెడ్డి
వురఫ్ పి.వి.ఆర్. మహేశ్వరరెడ్డి
తండ్రి శివరామిరెడ్డి, వయస్సు 43 సం.లు,
హిందు, ప్రవేటు వుద్యోగం, గిద్దలూరు టౌన్
మరియు మండలం, ప్రస్తుతం ఆదిమూర్తిపల్లె
గ్రామం,గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ 13-03-2025న ఉదయం గం.10:30 ని. లకు స్వయంగా గాని లేదా నీవకీలు గారి ద్వారా గాని హాజరై, నీఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 09-03-2025 ఇట్లు
శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
వాదిపరం అడ్వకేట్,
గిద్దలూరు.

(OR.21, R.34 C.P.C OF NOTICE)
IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL DISTRICT JUDGE, PRAKASAM DISTRICT AT ONGOLE
E.P. No. 21/2024 IN OS.No. 58/2017

Between:
Yadala Papa Rao ...DHR/ Plaintiff
And
Shaik Meera Saheb and anothers .....JDRs/Defendants

To
JDR.No.1
Shaik Meera Saheb, S/o Khasim, aged about 32 years, R/o D.No. 2-377(4/1) Bilal Nagar, Behind Papa Rice Mill, Ongole Town, Prakasam District.

Take notice that the decree-holder in the above suit presented an application to this Court that the Court may execute on your behalf a deed of sale whereof a draft is hereunto annexed, of the immovable property specified hereunder, and that the 18th day of March 2025 is appointed for the hearing of the said application, and that you are at liberty to appear on the said day and to state in writing any objections to the said draft.

Description of Property
Prakasam District Ongole Sub-Registration, Ongole Municipal Corporation, Ongole Rural Village Survey 120, Bilal Nagar Area, Plot No. 46- Northern side, Door.No.2-377(A), Assessment No. 1035022015, SC No. 57702, Tink roofed house to together with vacant site admeasuring an extent of 594.3 square feet or 66 square yards with all easementary rights with the following boundaries:-
East: Passage with the width of 4'3 left by the 1st respondent and his brother-28'3 feet
South: Property belongs to Shaik Baba- 21 feet
West: Plot No. 41 house belongs to ayyappa - 28'3 feet
North: Municipal Bazar - 21 feet

డ్రాఫ్ట్ సేల్ డీడ్

వ్రాయించుకున్నా వారు : తేది. నెల. 2024వ సంవత్సరమున ప్రకాశంజిల్లా ఒంగోలు టౌన్, పోతురాజుపాలెం, డోర్‌నెం. 56-1-27లో నివాసం యాదాల ఆదినారాయణ కుమారుడు పాపారావు అనువారికి

వ్రాయించియిచ్చిన వారు : ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్, బిలాల్ నగర్, మూడవ లైను నివాసం, షేక్ ఖాసిం సాహెబ్ గారి కుమారుడు షేక్ మీరా సాహెబ్ అను వారి తరపున ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జి గారైన శ్రీయతులు గారు వారి స్థానమీయులున్నాషెడ్యూల్ దాఖల ఆస్తి షేక్ మీరా సాహెబ్ అనువారు షేక్ మీరా సాహెబ్ తల్లి గారు అయిన షేక్ మహబూబీ వలన ఒంగోలు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, 1302వ వాల్యూం 705ల706 పుటంలో దస్తావేజు నెంబరు 3565/1993 విక్రయము వలన హక్కు అనుభవం కలిగిన ఆస్తులను గురించి ఎలాంటి వ్రాతలు వ్రాయకుండా ఇంటేస్టేట్ గా మరణించెను. ఆమె మరణనంతరం వారసత్వ చట్టరీత్యా ఆమె భర్త అయిన షేక్ ఖాశిం గారికిన్ని మరియు ఆమె కుమారులు షేక్ మీరా సాహెబ్, షేక్ బాబాగారులకు సంక్రమించి, వారు దాన విక్రయదికార సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్న ఆస్తుల గురించి తేది 28-07-2011న కుటుంబ విభాగేయ పత్రం వ్రాసుకొని ఒంగోలు సబ్ రిజిస్టార్ వారి ఆఫీసులో 1వ పుస్తకం దస్తావేజు 8885/2011గా రిజిస్టరు కాబడిన పార్టిషన్ దస్తావేజు ప్రకారం షేక్ మీరా సాహెబ్ వాటాకు రాబడిన సర్వహక్కులతో అనుభవించుచున్న సి-షెడ్యూలు దాఖలా ఆస్తిని, ఆయన కుటుంబ అవసర ఖర్చుల నిమిత్తం మరియు అప్పులను తీర్చుకొని నిమిత్తం బిల్ కాంట్రాక్టుగ రూ.35,00,000/-లకు విక్రయించి, విక్రయ ప్రతిఫలం క్రింద 10/06/2013దిన యాక్సిస్ బ్యాంకు ఒంగోలు వారి అకౌంటు ట్రాన్స్ ఫర్ ద్వారా రూ.1,80,000/-లున్నూ, తేదీ.11-06-2013 న యాక్సిస్ బ్యాంక్ ఒంగోలు వారి అకౌంటు ట్రాన్స్ఫర్ ద్వారా రూ. 1,20,000/- లు న్ను తే.13-06-2013 దిన యాక్సిస్ బ్యాంకు ఒంగోలు వారి చెక్కు నెంబర్.282652 ద్వారా రూ.10,00,000/-లున్ను మరియు తేది.14-06-2013 దిన యాక్సిస్ బ్యాంకు వారి అకౌంటు ట్రాన్స్ఫర్ ద్వారా రూ.1,50,000/- లున్ను మరియు తే.27-06-2013దిన యాక్సిస్ బ్యాంకు ఒంగోలు వారి చెక్కు నం.282653 ద్వారా రూ.10,00,000/- లున్ను మరియు రోఖంగా తే.31-08-2013ది వరకు దఫాలువారిగా రోఖంముగా రూ.5,50,000/- చెల్లించినందున వెరశి పై విధముగా ఇంత వరకు అడ్వాన్సుగా రూ.30,00,000/-లు చెల్లించినందున షేక్ మీరా సాహెబ్ కు ముట్టినది. కొరవ క్రయధనం తీసుకొనక, రిజిస్టరు చేయనందున మీరు లాయరు నోటీసు సహా పంపి దర్మిలా ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో O.S.నెం.58/2016 నంబరు దావా చేయగా 28-02-2023దిన డిక్రీ కాబడినది. డిక్రీ షరతుల ప్రకారం కొరవ క్రయధనం రూ.5,00,000/-లు ఒంగోలు జిల్లా కోర్టులో డిపాజిట్ చేయడం ద్వారా కొరవ ధనము పూర్తిగా షేక్ మీరా సాహెబ్ కుచెల్లించియున్నారు. ములసాయిదా విక్రయ దస్తావేజు షేక్ మీరా సాహెబ్ కోర్టు ద్వారా పంపి విక్రయము చేయవలసినది గాను, దస్తావేజు ముసాయిదు అమొదము లేదా అభ్యంతరములు తెలియవలసినదిగాను నోటిసు పంపించినందున ఎటువంటి జవాబు లేనందున 28-02-2016దిగల O.S 58/2016 డిక్రీ షరతుల ప్రకారం సదరు దావా O.S 58/2016 నంబరున ప్రతివాది అయిన షేక్ మీరా సాహెబ్ గాను 1వ అదనపు జిల్లా జడ్జి గారు అయిన నేను విక్రయ రిజిష్టరు చేయడమైనది. ఈ రోజు నుండి నీవు సర్వ సంపూర్ణ హక్కులతో యద్దేశ్చగా, స్వేచ్ఛగా అనుభవించుకోవలసినది. ఇందున గురించి షేక్ మీరా సాహెబ్ కు గాని అయన వారసులుగాని ఎటువంటి పేచీలు అభ్యంతరములు పెట్టుటకు హక్కు లేదనిన్నీ నిర్వివాదమైన ఆస్తి అని నీకు విక్రయము రిజిష్టరు చేయడమైనది.

షెడ్యూలు

ప్రకాశంజిల్లా, ఒంగోలు స.రి. యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ఒంగోలు రూరల్ గ్రామ సర్వేనెం. 120 రులో బిలాల్ నగర్ ఏరియలోని ప్లాటునెం. 46రులోని ఉత్తరం వైపున డోర్ నెంబర్ 2-377(4ఎ) రు అసెస్మెంట్ నెంబర్,1035022015 రు యస్. సీ నెం 57702 ర్లు గల రేకుల ఇల్లు స్థలమునకు హద్దులు తూర్పు :నేను మరియు నా సోదరుడు అయిన షేక్ బాబా గారలము కలసి వదులుకున్న 4అ3 అం.లు వెడల్పు గలబాట యీదిశ 28 అ3 అంలు

దక్షిణం : షేక్ బాబా గారి ఆస్థి యీదిశ 21

పడమర : ప్లాటునెం. 41రు అయ్యప్ప గారి రేకుల యిల్లు యీదిశ 28 అ3 అం

ఉత్తరం : మున్సిపల్ బజారు -యీదిశ 21 ఆ.ఈ హద్దులలోని స్థలం 594.3 చ.ఆ లు లేక 66 చ.గ.లు లేక 55.4 చ. మీ. లు స్థలం ఈ స్థలములో.. నిర్మించి యున్న రేకుల షెడ్డు 594.3 చ.అ.లున్నూ, యీ ఆస్తికి అమర్చిన యావత్తు సామానులున్నూ, యావత్తు రాకపోకలయీజ్ మెంటు హక్కులతో సహా పై ప్రకారం నీకు నేను విక్రయ ఖరారు అగ్రిమెంటు వ్రాయించి యివ్వడమైనది

ఇట్లు
ఇనకొల్లు వెంకటేశ్వర్లు
చక్కా బాల చెన్నయ్య
న్యాయవాదులు, ఒంగోలు

రోడ్డు లేక అవస్థలు

నడవడానికి ఇసుక గోతాలు ఏర్పాటు చేసుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వర్షాకాలంలో రహదారి మార్గం లేక మోకాలి లోతు నీటిలో నడిచి ఇళ్లలో నుంచి బిక్కుబిక్కుమంటూ బయటకు రావాల్సిన దుస్థితి ఏర్పడుతుందని భట్టిప్రోలు వితలేశ్వర నగర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీకి గత టిడిపి ప్రభుత్వ పాలనలో ఆనాటి మంత్రి, నేటి శాసనసభ్యులు నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో కాలనీ రహదారులకు సిసి రహదారి నిర్మాణానికి కీవాల్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కాలనీలో ఉన్న దేవస్థానానికి సమీపంలో మొదటి రహదారిని నాటి పాలకులు వదిలేశారు. అయితే ఆ సమయంలో ఎన్నికలు సమీపించటంతో కాలనీ మొత్తం కీ వాల్ నిర్మాణానికే పరిమితం అయ్యాయి. అప్పటినుండి కాలనీలో పాలకులు వదిలేసిన రహదారి మార్గంలో ఉన్న గహనిర్మాణదారులు సుమారు ఆరు నెలల పాటు వర్షపు నీరు మురుగునీటిలోనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో మరో మారు ఎమ్మెల్యే ఆనందబాబు చూడవతో ఈ కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే కాలనీలో ఉన్న అన్ని రహదారులు నిర్మాణం చేపట్టడానికి ఒకేసారి జరిగే పని కానందున అంచలంచెలుగా ఈ రహదారులను అభివద్ధి చేయాలని అటు అధికారులు పాలకులు యోచిస్తున్నారు. అయితే కీవాల్ నిర్మాణం కూడా లేకుండా వదిలేసిన ఈ రహదారికి ఈ ఏడాది వేసవి కాలంలోనైనా అటు పంచాయతీ అధికారులు కానీ, మండల అధికారులు గాని ప్రజాప్రతినిధులు చొరవ చూపి కనీసం మట్టి రహదారినైనా ఏర్పాటుచేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ ప్రాంతవాసులు కోరుచున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి సిసి రోడ్డు నిర్మించడంతో రోడ్డును దాటి మీరు బయటకు వెళ్లే మార్గం లేనందున ఈ రహదారి కి మెరక తోలించకపోతే మరింత అవస్థలుకు గురికావాల్సి వస్తుందని వాపోతున్నారు. కాలనీలో ఈ ప్రాంత వాసుల ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని అధికారులు మట్టినైన తోలి మెరక నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రహదారి ప్రాంతంలో ప్రజల ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని పంచాయతీ పాలకవర్గ సభ్యులకు వివరించి మెరక తోలించేందుకు చర్యలు చేర్పడతానన్నారు.

హామీలు 'పదిలం'.!

(మొదటిపేజీ తరువాయి)

మాటే మరోసారి చెప్పారు. అధికారంలోకి వచ్చాక దానికి నిధులు కేటాయించి పనులను ముందుకు తీసుకుపోవాలనే ఆలోచనలో కనిపించడం లేదు. ఎందుకంటే బడ్జెట్‌లో దానికి పెట్టిన నిధులే అందుకు అద్దం పడుతున్నాయి. దాని వల్ల లాభం లేదనా? ఈ స్థాయిలో నిధులు కేటాయించాల్సి వస్తుందనా? ఏమిటో కారణం నేతలకు కూడా అంతు చిక్కడం లేదు. వెలిగొండపై మాత్రం తీవ్ర నిర్లక్ష్యమే కనిపిస్తోంది. మళ్లీ కొత్త వ్యూహాలు తెరపైకి వచ్చాయి. గోదావరి జలాలను వెలిగొండకు తరలిస్తామని చెప్పారు. ఇక్కడ ఉన్న సొరంగాలను పూర్తి చేయడానికి మూడు దశాబ్దాలు పట్టింది. ఇప్పుడు గోదావరి నుంచి కృష్ణాకు అక్కడ నుంచి కాలువల ద్వారా ఇక్కడకు తరలింపు అంత సులువైన పనేనా ఆలోచించాలి. ఇది సాధ్యం కాదనే చర్చ కూడా నడుస్తోంది. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇచ్చి గ్రామాలు ఖాళీ చేస్తే వచ్చే నీటితో డ్యాము నింపుకోవచ్చని చెబుతున్నారు. ఇంకా రూ.4 వేల కోట్లు కేటాయించాలి. పనుల్లో వేగం లేదు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి దృష్టి లేదు. గత ప్రభుత్వంలోనూ ఇదే జరిగింది. అప్పటి సిఎం జగన్ కూడా పనులు పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం చేశారు. ఇదే ఇప్పుడు వాళ్ల నోటికి తాళం వేసింది. దానిపై గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. వెలిగొండపై రైతుల్లోనే కాకుండా పాలకపక్ష నేతల్లోనూ ఆశలు సన్నగిల్లుతున్నాయి. దీని కోసం ఇప్పటికే వామపక్షాలు ఉద్యమం చేపట్టాయి. దాన్ని మరింత ఉధృతం చేయక తప్పేలా లేదు. ఇక మార్కాపురం జిల్లా పైనా అదే మాట. కొత్తదనం లేదు. గడువు లేదు. ఎందుకు హామీ ఇచ్చినట్లు? సిఎంగా చేయడానికి పదే పది నిమిషాలు సమయం చాలు. నిర్ణయం తీసుకోవడానికే వెనుకాడుతున్నారు. మిగతా జిల్లాల్లో డిమాండ్లు ఉన్నాయంటూ ఏదేదో చెబుతున్నారు. ఆనాడు ఎన్నికలకు ముందు అవన్నీ కూడా ఉన్నాయి. అందరికీ తెలిసినవే. ఇప్పటికైనా జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాల్సిన అవసరం ఉంది. చేస్తామంటే ఎప్పటిలోగా అనేది కీలకం. అదే ఇప్పుడు లోపించింది. ఇక కార్యక్రమం ఏర్పాటు చేసిన స్థానిక ఎమ్మెల్యేకూ ఏమి దక్కిందంటే చివాట్లే.. ఆయన కష్టానికి ఫలితం లేకుండా పోయింది. పనితీరు బాగాలేదని మందలించారనే వార్తలు హల్‌చల్ చేశాయి. అసలు చంద్రబాబు ఇచ్చిన హామీలే ఇంతవరకూ అమలు చేయకపోతే ఇక్కడ ఎమ్మెల్యే పనితీరుపై ఇక చర్చ ఏమిటన్నదే ఆలోచించాలి. ఏమీ చేయకుండా పనితీరు బాగా లేదనుకోవడం కూడా వృథా వ్యవహారమే.!

పలువురికి మంత్రి గొట్టిపాటి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని పలు కుటుంబాలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం పరామర్శించారు. ముందుగా ముప్పవరం గ్రామంలోని ఉదయగిరి హనుమంతరావు మాతృమూర్తి రుక్మినమ్మ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఇటీవల పాముకాటుతో మరణించిన ఇంటూరి చిన్న సిద్ధయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో మరణించిన పోలిశెట్టి రాములు నివాసానికి వెళ్లి ఆయన పార్థవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇటీవల మరణించిన తోట నాగేశ్వరరావు తల్లి మహాలక్ష్మమ్మకు నివాళులర్పించారు. ముప్పవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పుచ్చకాయల ప్రసాదు తల్లి సామ్రాజ్యమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. చిన్న మల్లవరం గ్రామానికి చెందిన పొనుగుబాటి హనుమంతరావు అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయం వాకబు చేసి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వెల్లటూరి రామ్మోహన్రావు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులు పరామర్శించారు. బోదవాడలో అనారోగ్యంతో మృతి చెందిన తేళ్ల ఐసన్‌కు నివాళు లర్పించారు. రేణింగవరంలో అమర్తపూడి సుబ్బారావుకు నివాలులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు బాలిన రామ సుబ్బారావు, కర్రీ వెంకట సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, రావూరి రమేష్ బాబు, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, జాగర్లమూడి భాను ప్రకాష్, గరిమిడి జగన్మోహన్‌రావు, అమర్తపూడి ఏసోబు, గొట్టిపాటి కాజా స్వామి, బొమ్మరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'జనసేన' ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వేమూరు

పిఠాపురం నియోజకవర్గంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శి సోమరౌతు అనురాధ విజ్ఞప్తి చేశారు. వేమూరు మండలంలోని వరాహపురం గ్రామంలో ఆ పార్టీ ఆవిర్భావ సభ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ గ్రామంలో ఈ సభ జరగనున్నదన్నారు. ఈ సభకు పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరవుతారని ఈ సభను విజయవంతం చేసేందుకు జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో షుగర్ నియంత్రణ

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఆహారపు అలవాట్లతోనే షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలని డాక్టర్ సిహెచ్ రవికుమార్, డాక్టర్ మంచాల విద్య తెలిపారు. గంగవరంలోని మంచాల రంగమ్మ, వెంకట్రామయ్య విద్యా వైజ్ఞానిక కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెడికల్ షుగర్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో సుమారు 135 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. తదుపరి క్యాంపు మే 11వ తారీఖున జరుగుతుందని నిర్వాహకులు కరి బాలచంద్ర సృజనలు తెలిపారు. క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని లేని పక్షంలో గుండెపోటు, కళ్ళకు సంబంధించిన వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు రావచ్చన్నారు. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం బాడీ చెకప్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ సిహెచ్ రవికుమార్, డాక్టర్ బోడింపూడి సమతా, మంచాల విద్య, డాక్టర్ అన్నమురాజు సాంబయ్య వైద్య సేవలు అందించారు. మే 11వ తేదీన జరగబోయే క్యాంపుకు గంగవరం గ్రామస్తులు నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. క్యాంపులో టి.గోవిందరాజులు, యూవి. సుబ్బాయమ్మ, బి.సూరిబాబు, బి.వేణుగోపాలరావు, కె.రామకోటేశ్వరరావు, ఎం.జ్యోతి, టి.శ్రీనివాసరావు సహాయకులుగా పనిచేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి క్రింద, గుంటూరు-గుంతకల్ రైల్వే రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తి తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీర భాగాలు వేరువేరుగా రైల్వే ట్రాక్‌పై తెగి పడ్డాయి. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, వయస్సు 50 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. నరసరావుపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల వేధింపులతో ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-యద్దనపూడి

జాగర్లమూడి గ్రామ హెల్త్ సెంటర్‌లో సీహెచ్‌వోగా పని చేస్తున్న పి.సరోజినీ తనను అధికారులు వేదిస్తున్నారని ఆవేదనతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ప్రస్తుతం బాధితురాలు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గత మూడు నెలలుగా జీతం రాకుండా చేసి మండల వైద్యాధికారి శ్రీహర్ష ఇబ్బంది పెడుతున్నారని మనస్థాపంతొ ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. విధులకు హాజరు అయినప్పటికీ పెండింగ్ పనులు పూర్తి చేయక పొతే ఉద్యోగం మానివేయాలని రకరకాలుగా డాక్టర్ వేధించారని బాధితురాలి బంధువులు తెలిపారు. ఈ విషయమై డాక్టర్ శ్రీహర్షను వివరణ కోరగా ప్రస్తుతం ఆమె తన పరిధిలో లేదని రీజినల్ డైరెక్టర్ పరిధిలో ఉందని, ఆమె ఆరోపణలతో నాకు సంబంధం లేదని చెప్పారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-చీరాల

అక్రమ మద్యం విక్రయాలు చట్టరీత్యా నేరమని ఈపురు పాలెం ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం వేటపాలెం మండలం రామాపురం సముద్ర తీరంలో వాయాల రాంబా బు కూల్ డ్రింక్ దుకాణంలో అక్రమ మద్యాన్ని విక్రయి స్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో 14 మద్యం బాటిళ్లు కూల్ డ్రింక్ షాపులో ఉన్నట్లు గురించి దుకాణ నిర్వాహ కుడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకట్రావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పులి వెంకట్రావు మృతి తీరని లోటు

నివాళులర్పించిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

టీడీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన సీనియర్ నాయకులు, అక్కాయిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ మాజీ ప్రెసిడెంట్ పులి వెంకట్రావు(55) మృతి తీరనిలోటు అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం అక్కాయిపాలెంలోని స్వగృహంలో వెంకట్రావు మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ వెంకట్రావు కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. నేడు అక్కాయిపాలెంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సామ్రాజ్యమ్మకు కరణం బలరాం నివాళి

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని ముప్పవ రంలో ఆదివారం జరిగిన పుచ్చకాయల సామ్రాజ్యమ్మ దశ దిన కార్యక్రమంలో కరణం బలరామకృష్ణమూర్తి పాల్గొన్నారు. ముప్పవరం శ్రీ పాటిబండ్ల గోపాల స్వామి ఉన్నత పాఠశాల హెచ్ఎం పుచ్చకాయల ప్రసాద్ తల్లి సా మ్రాజ్యమ్మ ఇటీవల మరణిం చిన విషయం తెలిసిందే. ఆది వారం ఆమె దశదిన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బలరామకృష్ణమూర్తి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో ఆదివారం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కాలం సుబ్బారావు

ప్రజా అధ్యయన చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

గిద్దలూరు రూరల్: సిపిఎం చేపట్టిన ప్రజా అధ్యయన చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఊస వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గిద్దలూరు నియోజకవర్గ పార్టీ సభ్యుల సమావేశం టి.ఆవులయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఊస వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని వెనుకబడ్డ ప్రకాశం జిల్లాకు పదివేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా చైతన్య అధ్యయన యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు టి.తిరుపతిరావు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి నిరసన తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు డి.తామస్, వై.సింగరయ్య, ఎస్.కె.అన్వర్, డి.రంగయ్య, బి.పూర్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఊసా వెంకటేశ్వర్లు

బహుమతి అందుకుంటున్న నాగశ్రీ ప్రవల్లిక

శాస్త్రీయ నృత్యంలో నాగ శ్రీ ప్రవల్లిక ప్రతిభ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి కుమారి పెదపూడి నాగశ్రీ ప్రవల్లిక నాట్య ప్రస్థానంలో మరో మైలురాయి చేరుకుంది. ప్రఖ్యాత వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 7 నుంచి 9 తేదీలలో నిర్వహించిన "విట్ పియార్" ది స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్‌లో శాస్త్రీయ నృత్యం పోటీలలో వ్యక్తిగత విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. నాట్య గురువులు దేవళ్ల మనోజ్ఞ మరియు ఎ.సంతోష్ కుమార్ చేతుల మీదగా రూ.6 వేల చెక్కు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే బృంద నాట్య పోటీలలో కూడా ప్రవల్లిక మరియు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ కూచిపూడి అకాడమీ మిత్ర బృందం ప్రదర్శించిన నవ దుర్గలు అంశం ప్రథమ బహుమతి సాధించి రూ.12 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. ప్రవల్లిక సాధించిన విజయాల పట్ల తల్లిదండ్రులు గోవిందమ్మ, శ్రీనివాసరావులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవల్లికను అభినందించారు. ఆమె గురువు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ భవిష్యత్‌లో ప్రవల్లిక మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. మండల విద్యాశాఖాధికారులు పి.లాజర్, టి.నవీన్ కుమార్, ప్రముఖ నాటక రంగ నిపుణులు ఆంజనేయ శర్మ, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొడాలి మోహన్ తదితరులు ప్రవల్లికను అభినందించారు.

సృజన సాహిత్య సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి

సృజన సాహిత్య సమావేశం కాళికా సమేత కమటేశ్వర స్వామి ఆలయంలో డాక్టర్ ఉబ్బా దేవపాలన అధ్యక్షతన నిర్వహించారు. ప్రఖ్యాత సాహిత్య వేత్త పాపిశెట్టి శశి కుమార్ పాల్గొని మాట్లాడుతూ చింతామణి నాటకం రాయటంలో కాళ్లకూరి సందేశం అమూల్యమైనదన్నారు. డాక్టర్ యు దేవపాలన మాట్లాడుతూ అద్దంకి మహానటులకు పురిటి గడ్డ అన్నారు. అద్దంకిలో ఇప్పుడు కూడా నటరత్నాలు ఎందరో ఉన్నారని పేర్కొన్నారు. పసుమర్తి కోటయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం మొదలైంది. అద్దంకికి ఖ్యాతి తెచ్చిన వారు ఎం ఆంజనేయరాజు, తన్నీరు నాగేశ్వరరావు, గోవాడ శ్రీకాంత్ అని వీరవల్లి సుబ్బారావు పేర్కొన్నారు. కీర్తిశేషులు అద్దంకి శ్రీరామమూర్తి అలాగే కీర్తిశేషులు బండారు రామారావు పుట్టంరాజు శంకర్రావు, అద్దంకి మాణిక్యాలరావు తమ నటనతో, పద్య ఆలాపనతో ప్రేక్షకుల హృదయాలని దోచుకున్నారని సృజన అధ్యక్షులు దివాకర్ దత్, షేక్ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మిద్దెబోయిన ఆంజనేయరాజు తన్నీరు నాగేశ్వరరావు దైవదత్త కంఠంతో, అద్భుతమైన నటనతో ప్రజలహృదయాలలో జీవించారని పుట్టంరాజు రాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఈ తరం ప్రేక్షకుల్ని అలరిస్తూ ఆలకుంట శ్రీనివాసరావు చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్రలో జీవిస్తున్నారని లక్కరాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. గోవాడ శ్రీకాంత్ చిన్నవాడైనా వారి పాత్రలు ప్రజల హృదయాలని స్పృశిస్తున్నాయని లెవి ప్రసాద్ చెప్పారు. మిద్దెబోయిన ఆంజనేయరాజు, తన్నీరు నాగేశ్వరరావు, ఆలకుంట శ్రీనివాసరావు, గోవాడ శ్రీకాంత్ రాగయుక్తంగా పాడి పద్య నాటక వైభవాన్ని అద్దంకి ప్రజల కళ్ళ ముందు ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, శ్రీమతి పాలపర్తి జ్యోతిష్మతి, యనమండ్ర వరలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, సంక సుబ్రహ్మణ్యం (బాబు), శేష తల్ప సాయి, జ్యోతి చంద్రమౌళి, షేక్ మస్తాన్ మాస్టారు, మహమ్మద్ అంజాద్ భాషా, ఆర్‌వి రాఘవరావు, మారం కోటేశ్వరరావు, మాస్టారు, అనంత నాగేశ్వరరావు, ఆర్.రాఘవ రెడ్డి, శ్రీ నిమ్మరాజు నాగేశ్వరావు, సాహితీ ప్రియులు నాటకరంగ అభిమానులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-నిజాంపట్నం

భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.శారద తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో వ్యవసాయ శాఖ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వెబ్ ల్యాండ్‌లో భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని ఆధార్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్, పట్టాదారు పాసుపుస్తకంతో సంప్రదించి రైతు విశిష్ట సంఖ్యను పొందవచ్చునని తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు అందించేందుకు సహాయపడుతుందని అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, వ్యవసాయ యాత్రాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ సూక్ష్మ సేద్యంపై రాయితీ విత్తనాలు, సూక్ష్మ పోషకాలు పంటల బీమా పొందడానికి తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా ఉండాలని ఆమె తెలిపారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన చెక్కులను ఆదివారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. పెదగాదెలవర్రు గ్రామానికి చెందిన కేశనేని రాంబాబుకు రూ.64979, చెవల శ్రీదేవికి రూ.46,843, మండూరు గ్రామానికి చెందిన రెడ్డి నాగరత్నంకు రూ.53824, చిగురుపాటి రవీంద్రబాబుకు రూ.39,600, చినపరిమి గ్రామానికి చెందిన మన్నె అనసూర్యకి రూ.59,325, చుండూరు గ్రామానికి చెందిన మోదుకూరు వెంకటేశ్వర్లు, ఏటి నగర్ గ్రామానికి చెందిన పులిపాక మోహన్ ప్రసాద్‌కు రూ.35,000 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ముద్రించిన రంజాన్ జేబు క్యాలెండర్‌ను ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాసాలు, పవిత్ర ఖురాన్ పఠనం, తరావీ నమాజ్ భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రాధాన్యత కల్పించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో మైనార్టీలకు అడుగడుగునా మోసమే ఎదురైందన్నారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5,434 కోట్లు ప్రకటించడంతో మైనార్టీల ముఖాల్లో మళ్ళీ చిరునవ్వు చిగురిస్తుందని అన్నారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. మైనారిటీ సబ్‌ప్లాన్ ద్వారా ఇతర శాఖల ద్వారా మైనార్టీలు లబ్ది పొందేందుకు వీలుగా సబ్ ప్లాన్‌కు రూ.2512 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

బూదవాడకు బస్సు సౌకర్యం కల్పించండి

ఆర్టీసీ డీఎంకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని బూదవాడ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. అద్దంకి నుంచి పంగులూరు చిన్నమల్లవరం గ్రామాలను కలుపుతూ బూదవాడ మీదుగా ఇంకొల్లుకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఆదికట్ల వారి పాలెం నుంచి బూదవాడకు బిటి రోడ్డు నిర్మించాలని, బూదవాడ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డిలు మంత్రి గొట్టిపాటికి ఆదివారం విన్నవించారు. బస్సు సౌకర్యం విషయమై డిపో మేనేజర్‌ను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చిన్నమల్లవరం గ్రామంలో నిర్మితమవుతున్న ధ్యాన మందిర నిర్మాణ పనులకు నిధులు సమకూర్చాలని గ్రామ మహిళలు మంత్రి రవికుమార్ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. రోడ్ల విషయం మాట్లాడుతూ ప్రస్తుతం బీటీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన తర్వాత, నూతన బీటీ రోడ్ల పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపడతామన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ విషయమై అధికారులతో ఫోన్లో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి, కాపర్ వైర్ కొనుగోలుదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి వెంట టీడీపీ నాయకులు రావూరి రమేష్ బాబు, మాజీ జడ్పీటీసీ కర్రీ వెంకట సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్ వలి, చింతల సహదేవుడు, వెంకటేశ్వర్లు, వలపర్ల సుబ్బారావు, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, విద్యుత్ శాఖ ఏఈ అనిల్ కుమార్, జాగర్లమూడి భాను ప్రకాష్, చౌదరి బాబు, గొట్టిపాటి కాజా స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి

సోమవారం 10 మార్చి 2025

12న విజయవాడలో మహాధర్నా

సమస్యలు పరిష్కరించాలని

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని, ఏడాదికి 200 రోజులకు పని దినాలు పెంచాలని, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి చేసింది. ఆదివారం నాడు స్థానిక ఎల్‌బిజి భవనంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు మీడియాకు వివరాలు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులతో గ్రామీణ కూలీలకు పని దినాలు క్రమంగా పడిపోతున్నాయని అన్నారు. స్థానికంగా పనులు లభించక ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు పోయే క్రమంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం, వలసల నివారణ, కూలీల జీవితాల్లో మౌలిక మార్పులు తెచ్చేందుకు నిర్దేశించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ఏడాదికి రూ.2.50 లక్షల కోట్లు కేటాయించడం ద్వారా చట్టం లక్ష్యాలు సాధించగలమన్న నిపుణుల సూచనలను కేంద్రం పెడచెవిన పెట్టడం విచారకరమన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నా, దేశం ఆర్థికంగా అభివద్ధి సాధించాలన్నా, సంక్షోభం నుంచి బయటపడాలన్నా ప్రజల చేతుల్లోకి డబ్బు చేరాలని అందుకు ఉపాధి హామీ వంటి వాటి ద్వారానే సాధ్యం అన్నారు. ఈ పథకానికి రూ 2.50 లక్షల కోట్లకు, కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించడం పట్ల మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధి అర్థమవుతుందని విమర్శించారు. ఉపాధి హామీని తమిళనాడు, కేరళ రాష్ట్రాల మాదిరి పట్టణాలకు కూడా విస్తరింపజేయాలని, పని ప్రదేశంలో కూలీలకు కల్పించాల్సిన మౌలిక వసతులు చట్ట ప్రకారం అమలు చేయాలని, పనిముట్లను, వాటికి కేటాయించిన నిధులతో అందివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసిందని, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఆ ఊసే లేదని విమర్శించారు. రైతాంగానికి సుఖీభవ కల్పిస్తున్నట్లు వ్యవసాయ కార్మికులకు కూడా ఏడాదికి కుటుంబానికి రూ.12 వేల చొప్పున భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈపాటికే తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఇటువంటి పథకం అమలులో ఉందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు ప్రశ్నార్థకంగా మారాయని, ఇంటి నిర్మాణాలు చేపట్టి మధ్యలో ఆగిపోయినవి, వీటిని పూర్తిగావించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 12న విజయవాడలో జరుగనున్న మహా ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కేజీ మస్తాన్, కంకణాల వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, ఉబ్బా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రం ఆవిష్కరిస్తున్న వ్య.కా.సం. నాయకులు

రామాంజనేయులును సత్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయుడు రామాంజనేయులు

ఉద్యోగ విరమణ సభలో ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

క్రమశిక్షణ కలిగిన వ్యక్తి రామాంజనేయులు అని, ఉపాధ్యాయ వత్తిలో ఆదర్శనీయుడని పలువురు వక్తలు అన్నారు. ఒంగోలు మండలం ఉలిచి గ్రామానికి చెందిన చెందిన చుంచు రామాంజనేయులు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం ఒంగోలు రంగా భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు పాల్గొన్నారు. చుంచు శేషయ్య అధ్యక్షతన జరిగిన జనార్దన్ రావు మాట్లాడుతూ 37 సంవత్సరాలు ఉపాధ్యాయ వత్తిలో కొనసాగిన రామాంజనేయులుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, భవిష్యత్తులో ఉలిచి గ్రామ అభివద్ధికి కషి చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ రామాంజనేయులు ఉపాధ్యాయ వత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి అన్నారు. సూర్యశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీ కృష్ణ, యూటీఎఫ్ నాయకులు కొమ్మోజు శ్రీనివాసరావు, డి.వీరాంజనేయులు, ఎన్.చిన్నస్వామి, శారద నికేతన్ ఫౌండర్ డి.కోటేశ్వరరావు, ఐ.విజయ సారథి పాల్గొన్నారు. గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న దృశ్యం

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో కవి జాలాది మోహన్, సూపర్ స్టార్ కష్ణ కళా పరిషత్ తరపున మోహన్, గ్రంథాలయ సిబ్బంది యస్.అనిల్‌బాబు, పి. ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

అన్ని సామాజికవర్గాల వారికీ సాయం

ఒంగోలులో కమ్మవారి సేవాసంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కమ్మవారి సేవాసంఘం ద్వారా అన్ని సామాజికవర్గాల వారికీ సహాయ సహకారాలు అందిస్తామని సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ తెలిపారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం నూతన కార్యాలయాన్ని స్థానిక నిర్మల్‌నగర్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు సంఘం ద్వారా ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా తమ సంఘం పనిచేస్తుందన్నారు. గౌరవాధ్యక్షులు సీతా రామయ్య మాట్లాడుతూ సంఘం మంచి కార్యక్రమాలు చేపట్టి.. ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. సంఘం సెక్రటరీ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి నెలా రూ.లక్ష వరకు పేద విద్యార్థులకు ఫీజుల కోసం అందిస్తామని చెప్పారు. అనంతరం పలు పేద విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి జి.శ్రీనివాసరావు, కాట్రగడ్డ రఘు, బాపయ్య చౌదరి, అబ్బూరి శ్రీనివాసరావు, వెంకట్రావు, వెంకట్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండవ మురళీకృష్ణ

శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

శాస్త్రీయ పద్ధతులతో అత్యధిక దిగుబడి

ఈడీ శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రైతాంగం పొగాకు సాగులోను, గ్రేడింగ్‌లోను శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం నాడు స్థానికంగా పొగాకు ఉత్పత్తిదారులు పొగాకు బోర్డు సంయుక్తంగా నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుండి జిల్లాలో వేలం ప్రక్రియ ప్రారంభిస్తున్న నేపథ్యంలో బోర్డు అధికారుల సూచనల మేరకు పొగాకు బేళ్ళను అమ్మకాలకు తెచ్చుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఈ ఏడాది నాణ్యమైన పొగాకు ఉత్పత్తి సాధించిన రైతలను ఆయన అభినందించారు. గత ఏడేళ్లుగా తన బాధ్యతలను సంతృప్తిగా నిర్వహించేందుకు తోడ్పడిన బోర్డు అధికారులు, సిబ్బందికి, పొగాకు ట్రేడర్స్, పొగాకు ఉత్పత్తిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీధర్ బాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బోర్డు రీజినల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు,సెక్రటరీ డి వేణుగోపాల్, ఐటీసి మేనేజర్ శివకుమార్, జిపిఐ మేనేజర్ ప్రభాకర్ బోర్డు సిబ్బంది, పలువురు పొగాకు ట్రేడర్స్,ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఒంగోలు నగర నూతన కన్వీనింగ్ కమిటీ నూతన కన్వీనర్‌గా మన్నేపల్లి ప్రమీల ఎన్నికయ్యారు. ఆదివారం నాడు స్థానిక మల్లయ్య లింగయ్య భవనంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు యస్.రావమ్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.విజయ, కె.అనంతలక్ష్మి పర్యవేక్షణ లో జరిగిన కార్యక్రమం లో నగర కమిటీ ఎన్నిక జరిగింది. కోకన్వీనర్లుగా మల్లేశ్వరి, విజయభారతి, చౌటూరి పోలమ్మతో పాటు మరో 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

దోమలతో తీవ్ర ఇబ్బందులు

- రహదారులు దారుణంగా ఉన్నాయి.. - సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో వెల్లడించిన ప్రజలు

ప్రజాశక్తి-కొండపి

ప్రతి ఇంటి ముందు మురుగునీటి కుంటలు ఉండి.. దోమలు విపరీతంగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు సిపిఎం నేతల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మిట్టపాలెంలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలకు ప్రజలు తమ సమస్యలు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీరు, డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దళితవాడలో మరీ దారుణంగా ఉన్నాయన్నారు. రోడ్లు కాలువలు ఏకమై కనిపిస్తున్నాయని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ యాత్రలో వెలుగుచూసిన సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. బడ్జెట్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తగిన స్థాయిలో పంచాయతీలకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేయాలని చెప్పారు. మిర్చి, శనగ పంటల ధరలు పడిపోయాయని, పొగాకు పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందన్నారు. ధరల స్థిరీకరణకు ప్రభుత్వం రూ.మూడు వేల కోట్లు కేటాయించాలని రైతు ఉద్యమ నేతలు కోరుతుంటే కేవలం బడ్జెట్లో రూ.300 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ కొండేపి ప్రాంతంలో మూసికి సాగర్ నీరు శాశ్వతంగా వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం వద్ద సాగర్ కెనాల్‌కు శాశ్వత లాకులు ఏర్పాటు చేసి మూసికి నీరు లింకు చేయడం ద్వారా చీమకుర్తి, సంతనూతలపాడు, కొండేపి, టంగుటూరు మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటి సౌకర్యం లభిస్తుందని అన్నారు. సమస్యల మీద ప్రజలు సిపిఎం నిర్వహించే ఉద్యమాలకు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్ మాట్లాడుతూ ఉపాధి చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తోందన్నారు. ఉపాధికి నిధులు పెంచాలని కోరుతుంటే ప్రతి ఏడాదీ కుదిస్తూ దాని నిర్వీర్యానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఎన్నికలకు ముందుగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, మండల నాయకులు గడ్డం వందనం, అంగలకుర్తి బ్రహ్మయ్య, ఎల్ సుధాకర్, వేశపోగు రూబేను, జి సురేష్, గడ్డం పిచ్చయ్య, గోపి, శీదల్ల ఏడుకొండలు, అంకయ్య, టి దావీదు, మోహన్, వంశీ, యెస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి డిమాండ్

మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి-దర్శి

అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. కార్మికులు, సమాజ పరిణామ క్రమం, శాస్ధీయ ఆలోచ న, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉద్యోగ కార్మికలపై ప్రభా వం, రాజకీయాలు, కార్మిక వర్గ వైఖరి అంశాలను 2 రోజుల పాటు 4 అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా జివి కొండారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల వలన ప్రభుత్వానికి రూ.కోట్లలో సెస్ ద్వారా ఆదాయం వస్తుందని అన్నారు. ఆ నిధులు రూ.2 వేల కోట్లు గత వైసిపి ప్రభుత్వం వివిధ పథకాలకు వాడు కుని కార్మికులకు ఇవ్వవలసిన సంక్షేమ పథకాలకు నిధులు ఇవ్వకుండా క్లైమ్స్ పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీల్లో అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం ఆపిన క్లైమ్స్‌కి నిధులు విడుదల చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని భవన నిర్మాణ కార్మికులకు సెస్ నిధులు పునర్ధన చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మోటర్ వాహన చట్టం వలన ప్రమాదాలు జరిగితే డ్రైవర్సుకి జరిమానాలు, జైలు శిక్షలు, ఇన్సురెన్స్ రద్దు, వాహనాలు సిజ్ చేయడం వంటి కఠిన తరమైన శిక్షలు అమలు చేయాలని తెచ్చిందని చట్టాన్ని సిఐటియు వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్రంలో 40లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని అన్నారు. ముసలి వారైనా, 70ఏళ్లు వచ్చినా ఏ హక్కులు లేకుండా భద్రత లేకుండా జీవిస్తున్నారని అన్నారు. గుర్తింపు కార్డులు, ఆరోగ్య భీమా, ఫించన్లు, రిటైర్‌మెంట్ స్కీంలు అమలు చేయాలన్నారు. సిఐటియు నియోజకవర్గ నాయకులు తాండవ రంగారావు మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.6వేలు వేతనం ఇవ్వడం అన్యాయమని, రూ.10వేలు ఇవ్వాలని, నెల నెల వేతనాలు ఇవ్వాలని, పనిముట్లు, పరికరాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిఫల్ కార్మికులు, గోపాల మిత్రలు, ఆశా, అంగన్‌వాడీ, పంచాయితీ తదితర కార్మిక నాయకులు మాట్లాడారు. కార్యక్రమానికి సిఐటియు నాయకులు ఈమని నాగేశ్వరరావు ప్రిన్సిపుల్‌గా వ్యహరించగా సిఐటియు మండల కార్యదర్శి ఉప్పు నారాయణ, షేక్ కాలేభాషా, ఆలూరి ఇస్మాయిల్, గోవిందమ్మ, చలమయ్య, ఎం నాతాన్, బాలమ్మ, సీతామహాలక్ష్మి రాణీ, ఆశ్వీరాధం, రైతు సంఘం కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, గర్నిపూడి జాన్ సామ్యేల్ పాల్గొన్నారు.

నామకరణంలో పాల్గొన్న బూచేపల్లి వెంకాయమ్మ

చిన్నారులకు నామకరణం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని వైసిపి కార్యకర్త సందిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమారుని శాంతి పూజ, నామ కరణంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని జగన్మోహన్‌రెడ్డిగా నామకరణం చేశారు. క్యాక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఓణీల వేడుకలో పాల్గొన్న బూచేపల్లి వెంకాయమ్మ

శుభకార్యక్రమాల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో గువ్వల చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె, కుమారు ఓణీలు, పంచల వేడుకల్లో జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆ గ్రామంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుతో సత్యలక్ష్మిని సత్కరిస్తున్న వనిత క్లబ్ సభ్యులు

సత్యలక్ష్మికి ఉత్తమ మహిళా అవార్డు

ప్రజాశక్తి-దర్శి

దర్శనాపురి వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా సేవ అవార్డు పొందిన వాసవి వనిత క్లబ్ కార్యదర్శి తెల్లాకుల సత్యలక్ష్మిని స్ధానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆమెకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు మునగ నీలిమ, ఆర్‌ఎస్ మునగా ఆంజనేయులు, సంఘ సేవకులు జీవి రత్నం పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న పాలపర్తి రమణయ్య

డయాలసిస్ సెంటర్‌కు విరాళం

ప్రజాశక్తి - పామూరు

కనిగిరి ప్రభుత్వ హాస్పిటల్లో డయాలసిస్ సెంటర్ అభివృద్ధికి పామూరు పాత చెరువు ఆయకట్టు చైర్మన్ పాలపర్తి రమణయ్య రూ.50వేల ఆర్థిక సాయం శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆదివారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. సయ్యద్ అమీర్ బాబు, పాలపర్తి మస్తానయ్య, గోపాలపురం డీలర్ గంధం హరిబాబు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మీడియాది గొప్ప పాత్ర

ఎసిఎన్ న్యూస్ ప్రారంభిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పట్టణంలోని కురిచేడురోడ్డులో ఎస్-ఎస్‌సిబిపిఎల్ కేబుల్ ఆఫీసు, ఎసిఎన్ న్యూస్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మీడియా పని చేయాలని అన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో పని చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ అయ్యేందుకు మీడియా కృషి ఎంతైనా అవసరమన్నారు. సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు మీడియా ద్వారానే బయటికి వస్తాయన్నారు. బలవంతుల నుండి బలహీనులకు రక్షణ మీడియా ద్వారానే సాధ్యమన్నారు. గత ప్రభుత్వం మీడియాపై కూడా నియంత్రణ విధించి ప్రజాగ్రహానికి గురికాక తప్పు లేదన్నారు. తమ తొమ్మిది నెలల కూటమి కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటి శాఖమంత్రి నారా లోకేష్‌బాబు సారధ్యంలో ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని అన్నారు. అదే స్ఫూర్తితో దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు తన వంతు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమెతో పాటు మాజీ శాసన సభ్యులు నారాపుశెట్టి పాపారావు, సిఐ రామారావు, శేఖర్ పంతులు, చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, దారం సుబ్బారావు, శోభారాణి, వల్లెపు నారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, గోపు వెంకటేశ్వర్లు, గుర్రం బాలకృష్ణ, మునగా శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఎం సుజాత

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుజాత మాట్లాడుతూ 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఉన్నత చదువులకు వెళ్లాలంటే 10వ తరగతిలో సాధించే మార్కులు ఎంతో కీలకమన్నారు. శ్రద్ధతో చదవాలని, వివిధ సూచనలు చేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉన్నత భవిష్యత్తు వస్తుందని అన్నారు. శ్రద్ధగా ఏకాగ్రతతో చదవాలని చెప్పారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేవిధంగా చదవాలని చెప్పారు. పదోతరగతి మార్కులే జీవితానికి ప్రామాణికమని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపుపై ప్రజలకు అవగాహన కలిగించాలి

ఎల్ఐసి సాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ గోపాల్

ఎల్ఐసి ఏజెంట్లతో మాట్లాడుతున్న మేనేజర్ గోపాల్

ప్రజాశక్తి - పొదిలి

జీవిత బీమా ఏజెంట్లు పాలసీల అమ్మకాల ద్వారా ప్రజల్లో పొదుపుపై అవగాహన పెంచాలని ఎల్ఐసి శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ ఈ గోపాల్ అన్నారు. ఎల్ఐసి అభివృద్ధి అధికారి పి సుబ్రహ్మణ్యం ఆర్గనైజింగ్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెంట్లు జీవన్ ఉత్సవ్ పాలసీలను విరివిగా అమ్మడం ద్వారా పాలసీదారులకు ఎన్నో ఉపయోగకరమైన అవకాశాలు అందించిన వారు అవుతారని అన్నారు. ఏజెంట్లు ఆర్థిక అభివృద్ధికి ఎల్ఐసిని వృత్తిగా ఎంచుకొని పనిచేయడం ద్వారా సమాజ ఆర్థిక స్థిరత్వానికి దోహదపడతారని సూచించారు. విశ్రాంత అభివృద్ధి అధికారి ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏజ్ ఎంతో కృషి, పట్టుదలతో పనిచేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఎల్ఐసి ఇస్తున్న తోడ్పాటు అందిపుచ్చుకొని ఏజెంట్లు ఉన్నతంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎల్ఐసి కొత్తగా తీసుకొస్తున్న పాలసీలపట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. పాలసీ దారులకు కలిగే ప్రయోజనాలు వివరించాలని అన్నారు. ఇటీవల తమ ఆర్గనైజేషన్లో ఎండిఆర్‌టి సాధించిన గోనుగుంట్ల శ్రీనివాసులు, జాజుల శ్రీనివాసులును సత్కరించారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఏజెంట్లు లీల, రమాదేవి, శ్రావణిని సన్మానించారు.

పున్నమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి - పిసీపల్లి

నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు

మండలంలోని ముద్ద పాడుకు చెందిన వృద్ధురాలు బొలిశెట్టి పున్నమ్మ మృతి చెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నా రు. పెద్ద కోడలు బొలిశెట్టి రాములమ్మ గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె కుటుంబ సభ్యులను వైసిపి నాయకులు మూలె రాజశేఖరరెడ్డి, విశ్వశాంతి స్కూల్ అధినేత ముప్పూరి రామారావు పరామర్శించారు. పున్నమ్మకు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మండే శ్యాంబాబు మృతికి రమాదేవి సంతాపం

ప్రజాశక్తి-కొల్లూరు

ప్రమాదంలో మృతి చెందిన తిప్పలకట్ట గ్రామానికి చెందిన మండే శ్యాంబాబుకు సిపిఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్యాంబాబు సిపిఎం సభ్యుడుగా, యువజన సంఘంలో చురుకుగా పాల్గొనేవాడని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంపునకు నిరసనగా హైదరాబాద్‌లో జరిగిన ఉద్యమంలో కూడా పాల్గొన్నాడని ఆమె అన్నారు. సంతాపం తెలిపిన వారిలో కొల్లూరు మండల సిపిఎం నాయకులు పి.నాగమల్లేశ్వరరావు, టి.సురేష్, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఏజీపీగా కొల్లా నరేంద్రకుమార్

ప్రజాశక్తి-పర్చూరు

నరేంద్ర కుమార్

పర్చూరు కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా మండలంలోని నాగులపాలెంకు చెందిన కొల్లా నరేంద్ర కుమార్ నియమితులు అయ్యారు. ఇప్పటి వరకు అద్దంకి కోర్టు ఏజీపీగా వై.రమేష్ బాబు ఇంచార్జి విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్చూరు కోర్టు ఏజీపీగా కొల్లా నరేంద్ర కుమారును నియమిస్తూ బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నరేంద్ర కుమార్‌ని అభినందించారు.

ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీరాల

ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మాజీ సలహాదారు షేక్ యూసుఫ్ మెహరాలి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఉద్యోగుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా జమండ్లమూడి శ్రీనివాసరావు, సహ అధ్యక్షులుగా ఎన్.కృపాచార్యులు, జనరల్ సెక్రటరీగా జి.సాయి మహేష్, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, మరో ఇద్దరిని, కోశాధికారిగా సూర్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిఓయంయస్ 65ను వ్యతిరేకిస్తూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-బాపట్ల

సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ వి.మృదుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. కేంద్రీయ విద్యాలయ వెబ్ సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. రెండో తరగతి నుంచి 9వ తరగతి అడ్మిషన్లకు ఏప్రిల్ 2 నుంచి 11 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు.

ఫ్లెక్సీలతో మూసుకుపోయిన బస్టాండ్

రాకపోకలకు ప్రయాణికుల ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు

ఫ్లెక్సీలతో మూసుకుపోయిన బస్టాండ్

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండల పరిధిలోని ఏల్చూరు బస్టాండ్ ఫ్లెక్సీలతో మూసుకుపోయింది. బస్టాండును ఆనుకొని మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. దీంతో బస్టాండ్ మందు బాబులకు అడ్డాగా మారింది. మందు తాగి పడవేసిన గ్లాసులు, ఖాళీ మద్యం బాటిళ్లు బస్టాండ్ ప్రాంగణంలో దర్శనమిస్తున్నాయి. వీటిని నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ప్రయాణికులు బస్టాండ్‌లోకి వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం రహదారులపైనే వేచి ఉంటున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, వద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్టాండ్‌ను 2003లో పంచాయతీరాజ్ శాఖ నిధుల నుంచి రూ.2 లక్షల వ్యయంతో నిర్మించారు. అప్పటి ఎంపీ డి. రామానాయుడు, అప్పటి మార్టూరు ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య ప్రారంభించారు. బస్టాండ్ ఆనుకొని నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపు, తొలగించాలని, బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన మద్యం ఖాళీ బాటిల్స్‌ను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలో ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మహిళల శక్తిని గుర్తించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మాట్లాడుతున్న మొర్రి పిచ్చయ్య

ప్రభుత్వాలు మహిళల శ్రమ శక్తిని గుర్తించాలని గిద్దలూరు మండల యుటిఎఫ్ అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అన్నారు ఆదివారం గిద్దలూరు యుటిఎఫ్ కార్యాలయంలో జి.విశ్రాంతమ్మ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తల్లో స్త్రీలు ప్రధానమని, సంపద సృష్టించే స్త్రీలకు కనీస హక్కులు అమలు చేయాలని అన్నారు. అనేక మంది మహిళా పోరాటం ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానంగా వివిధ ప్రభుత్వ రంగాలలో పనిచేసే మహిళలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పని గంటలు, పిఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.తామస్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పద్మ, ఏ.కుమారి, జోష్మిని, షేక్ సబీరా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగాని ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రేపల్లె

పూజలు నిర్వహిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

పట్టణంలోని పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పున ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. మంత్రి అనగాని చేతుల మీదుగా పూజాది కార్యక్రమాలు, హోమం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, నవగ్రహాల ప్రతిష్టతో పాటు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 73 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయ పున ప్రతిష్ట కార్యక్రమం తన చేతులమీద జరగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. 1952లో స్థాపించబడిన ఈ ఆలయం రోడ్ల అభివృద్ధిలో భాగంగా లోతట్టుకు చేరుకోవడంతో వర్షాకాలం భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. తదుపరి కొంతకాలానికి ఆలయం శిథిలావస్థకు చేరడంతో భక్తులు, దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరల నూతన ఆలయాన్ని పునర్నిర్మించుకుని నేడు శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు, హోమాలు నిర్వహించి విఘ్నేశ్వరునికి ప్రాణప్రతిష్ఠ చేసుకోవటం జరిగిందని తెలిపారు. అనంతరం వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ పంతాని మురళీధర రావు, మంత్రి సోదరులు శివప్రసాద్, టిడిపి నాయకులు తాత ఏడుకొండలు, ఆర్డిఒ రామలక్ష్మి, డిఎస్పి శ్రీనివాసరావు, ఆలయ కార్య నిర్వాహణాధికారి వెంకట అప్పలాచార్యులు, మంత్రి వ్యక్తిగత సహాయకులు ధర్మతేజ, టిడిపి మీడియా సెల్ కోఆర్డినేటర్ వేమూరి అజయ్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ఒలింపియాడ్‌లో ఆక్రిడ్జ్ విద్యార్థుల హవా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు: ఎయిమ్స్ ఒలింపియాడ్‌లో నాగులుప్పలపాడు ఆక్రిడ్జ్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. జాతీయ స్థాయిలో ఆ పాఠశాల విద్యార్థులు వివిధ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణ తెలిపారు. జాతీయ స్థాయిలో హనుమ లోహిత్ రెండవ ర్యాంకు, రోషిణి నాలుగో ర్యాంకు సాధించారు. రాష్ట్రస్థాయిలో పి.ఉదయ్ రెండవర్యాంకు, షేక్ దిల్షాద్ జానీ ఏడవ ర్యాంకు, సాధించారు. సౌమ్యశ్రీ జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వాహకులు ఎండీ కలీమ్ ఖాన్ కడియాల ప్రభాకర్ చేతులమీదగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్ని విద్యార్థులను అభినందించారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల 'స్వచ్ఛ' సేవ

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆరో రోజైన ఆదివారం కాకుమాను మండలం అప్పాపురం, రేటూరు గ్రామాల్లో ఉన్నత పాఠశాల, పంచాయతీ కార్యాలయం పరిసరాలతో పాటు ప్రధాన కూడలి ప్రాంతాలను శుభ్రపరిచారు. చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రోడ్ల వెంట మొక్కలు నాటారు. చెట్ల వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన అనేక కార్యక్రమాలను గ్రామస్తులు ఇదే విధంగా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్–ఎస్ కోఆర్డినేటర్లు డి.విజయ్ కుమార్, కె.లావణ్య, కె.వెంకటేశ్వర్లు, కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎన్.అశోక్, రాకేష్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వంటపాత్రలు అందజేస్తున్న దాతలు

అన్నదానానికి వంటపాత్రలు వితరణ

ప్రజాశక్తి-అద్దంకి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కార్యక్రమానికి అవసరమైన వంట పాత్రల సామగ్రిని దాతలు అందజేశారు. నరసరావుపేట మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన మల్లవరపు శవరయ్య – అన్నమ్మల జ్ఞాపకార్థం వారి కుమార్తె, మనవడు రూ.50 వేల విలువైన వంట పాత్రలను ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు సమక్షంలో పరిపాలన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి గొట్టిపాటి

వధూవరులకు మంత్రి గొట్టిపాటి ఆశీర్వాదం

ప్రజాశక్తి-అద్దంకి

ఒంగోలు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అద్దంకి పట్టణానికి చెందిన రామిశెట్టి నరసింహా రావు–శ్రీదేవీల చిన్న కుమారుడు యశ్వంత్ కృష్ణ వివాహం ఈ నెల 7వ తేదీన జరిగింది. ఆదివారం పట్టణంలోని సింగరకొండ రోడ్డులోని కుక్కట్ల కన్వెన్షన్‌లో జరిగిన యశ్వంత్ కృష్ణ–భావనల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై నూతన వధూవరులు యశ్వంత్ కృష్ణ – భావనలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.

'సూర్యలంక' తీరంలో ప్రకృతి క్షేత్రం

- బాపట్ల సూర్యలంక రహదారిలో ఎకో టూరిజం
- నేడు సేంద్రీయ ఆహార ఉత్పత్తులతో రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి బాపట్ల

పర్యాటక కేంద్రమైన బాపట్ల-సూర్యలంక మార్గంలో జీడి మామిడి తోటల్లో కనువిందు చేసే ఆహ్లాదకర వాతావరణంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేచర్ క్యాంపు ఏర్పాటు చేశారు. సుందర సూర్యలంక సముద్ర తీరంలో తీయటి అనుభూతిని పంచే క్షేత్రాన్ని అటవీ అభివద్ధి సంస్థ అన్ని హంగులతో తీర్చి దిద్దింది. ఈ నెల 10న సేంద్రియ ఎరువులతో పండించే ఆహార ఉత్పత్తుల రెస్టారెంట్ ప్రారం భోత్సవం కానుంది. ఆంధ్ర ప్రదేశ్ అటవీ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల సూర్యలంక రహదారిలో ఏర్పాటైన ప్రకతి క్షేత్రం పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఆహ్లాదాన్ని పంచే ఒక చల్లటి వాతావరణం లో ఏర్పాటైన ఈ టూరిజం స్పాట్ ఒక ప్రకతి క్షేత్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది.

లక్షల మంది పర్యాటకులకు కనువిందు చేసే అద్భుత సుందర సముద్ర తీరంలో అటవీ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఎకో టూరిజం ఆహ్లాదకర అనుభూతిని పంచుతోంది.

బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి విచ్చేసే పర్యాటకులకు అనేక వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ, సూర్యలంక రహదారిలో ఏర్పాటైన ప్రకతి క్షేత్రం అందమైన ఆహ్లాదాన్ని పంచుతోంది. తనివి తీరా తిలకించేలా ఈ క్షేత్రం అభివద్ధి దిశగా అడుగు లేస్తోంది. 2019లో ఏర్పాటుచేసిన ఎకో టూరిజం అనేక వసతులతో పర్యాటకులకు చక్కటి అనుభూతిని పంచేలా తీర్చిదిద్దుతున్నారు.

ఎకో టూరిజం ప్రవేశ ద్వారం

ఇప్పటికే ఆరు వసతి గహాలు అందుబాటులో ఉన్నాయి. పర్యాటకుల సంఖ్య క్రమేపి పెరుగుతుండటంతో మరొక ఆరు వసతి గహాలను ఏర్పాటు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో అవి అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఇక్కడ ఎకో టూరిజం పర్యవేక్షణలో రెస్టారెంట్ ప్రారంభించానున్నారు. ఇక్కడ సేంద్రీయ వ్యవసాయంతో చేసే వంటకాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రకతి రమణీయత ఉట్టిపడేలా అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలను అటవీ అభివృద్ధి సంస్థ పెంచుతోంది. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు కూడా ఒక చక్కటి ఆత్మీయ విందును ఏర్పాటు చేసేలా సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల తో రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ వసతి గహాలు వినియోగించుకునే పర్యాటకులు ఇదే సందర్భంగా బయట వాతావరణం లో నీడనిచ్చే చెట్ల కింద సేద తీరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ నుండి సముద్ర తీరానికి పర్యాటకులను తీసుకెళ్లేందుకు అందుబాటులో వాహనాలు కూడా ఏర్పాటు చేయబోతున్నారు. సముద్ర తీరానికి అతి దగ్గరలో ఉన్న ఈ ప్రకతి క్షేత్రం ఒక అందమైన పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్నామని అటవీ అభివద్ధి సంస్థ జోనల్ మేనేజర్ గీతిక తెలిపారు. ఈనెల 10వ తేదీ ఇక్కడి రెస్టారెంట్ పూర్తి సేంద్రియ వంటకాలతో అందుబాటులోకి వస్తుందని ఆమె వెల్లడించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

స్త్రీ విముక్తి సంఘటన సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత, వాటివల్ల కలిగే కీడును జనానికి కనిపించకుండా చేయడానికి అద్వానీ రథయాత్ర చేపట్టాడని బొమ్మరిల్లు వ్యవస్థాపకులు, ప్రముఖ రచయిత పి.రాజ్యలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా స్థానిక ఈమనిపాలెం లో స్త్రీ విముక్తి సంఘటన ప్రకాశం జిల్లా కమిటీ ఆదివారం సభ జరిగింది. కార్యక్రమానికి స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి శాంతకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జనాన్ని జీవితం చుట్టూ కాకుండా మతం చుట్టూ ఆలోచించేలా ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. మనుధర్మ శాస్త్రమే రాజ్యాంగం కావాలని కోరుకుంటున్న బిజెపి మహిళలను బానిసలుగా మార్చడానికి ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. జనసాహితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జివి కష్ణయ్య మాట్లాడుతూ అందాల ప్రదర్శనలు, పోటీలు సౌందర్య ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యూహం మాత్రమేనని, సామ్రాజ్యవాదుల వ్యూహంలో చిక్కి స్త్రీలు మానసిక ఒత్తిడికి గురై, ఆర్థిక స్వాతంత్రం కోల్పోతున్నారన్నారు. వస్తు వ్యామోహ సంస్కతి ఇందుకు అదనపు ఒత్తిడిని సష్టిస్తుందని పేర్కొన్నారు. అందానికి నిర్వచనాన్ని, మార్గాన్ని కూడా పెట్టుబడిదారులే నిర్దేశిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా 500 బిలియన్ డాలర్ల మార్కెట్ ని కాస్మోటిక్ రంగం కలిగి ఉందన్నారు. ప్రతి సంవత్సరం 25 వేల కోట్ల రూపాయలు విలువైన సౌందర్య ఉత్పత్తులు దేశ

మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

మహిళలు కొంటున్నారని, ఈ ఉచ్చు నుండి స్త్రీలను బయటపడవేయడం ద్వారా సామ్రాజ్యవాదుల ఆర్థిక పునాదిని తగ్గించగలుగుతామని ఆయన తెలిపారు. ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.తిరుమల మాట్లాడుతూ విద్యార్థుల్ని, చిన్న పిల్లలను సోషల్ మీడియాకు బందీలుగా చేస్తున్నారని, ఈ ఊబిలో కూరుకుపోయిన పిల్లలు టీచర్లను అశ్లీల దష్టితో చూస్తున్నారన్నారు. టీచర్లను చంపడానికి కుట్ర చేసే స్థాయికి పిల్లల్ని దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. లలితకుమారి మాట్లాడుతూ ప్రకతి వనరులనూ – మానవ శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులు, వారిని ప్రోత్సహిస్తున్న పాలకుల కారణంగానే ప్రజల జీవితాలు సమస్యలమయం అవుతున్నాయన్నారు. ఈ వ్యవస్థను మార్చుకోకుంటే ఏ సమస్యలూ పరిష్కారం కావని, ఏ పాలకులూ– మతాలూ దీనికి పరిష్కారం కాదని తెలియజేశారు. ఎపిటిఎఫ్ నాయకులు అనురాధ ప్రసంగించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు డి రేణుక, జిల్లా నాయకులు సుజాత నాయకత్వం వహించగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

- అనుమతి ఇచ్చిన మేర కంటే ఎక్కువ పండించారు
- కొండపి వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు సోమవారం జువ్విగుంట క్లస్టర్‌లోని జువ్విగుంట గ్రామం నుంచి 18 బేళ్లను వేలానికి అనుమతిస్తున్నట్లు తెలిపారు. రైతులు వాళ్ల పొగాకు అమ్మకానికి వీలుగా వాళ్ల క్లస్టర్ తేదీ నాటికి బేళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. అదే విధంగా కొండపి వేలం కేంద్రం పరిధిలో మొత్తం 13 క్లస్టర్‌లలో 45 గ్రామాలు ఉన్నాయని అన్నారు. వేలం కేంద్రం పరిధిలో మొత్తం రైతులు 3,974 మంది ఉండగా 2,846 బ్యారన్‌లు ఉన్నాయి. ఈ సంవత్సరం పొగాకు బోర్డు వారు అనుమతి (7733 హెక్టార్లు) ఇచ్చిన దాని కంటే రైతులు పండించిన విస్తీర్ణం 10,369 హెక్టార్లలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. కొండపి వేలం కేంద్రంలో బోర్డు వారు 2024-25 సంవత్సరానికి 12 మిలియన్ల పొగాకు అనుమతి ఇవ్వగా అందులో సుమారు 19 మిలియన్ల పొగాకును రైతులు పండించారన్నారు. ఈ సంవత్సరం రైతుల పండించిన పొగాకులో 35శాతం బ్రైట్, 35 శాతం మీడియం, 30శాతం లోగ్రేడు ఉందని తెలిపారు.

గత సంవత్సరం 16.58 మిలియన్ల అమ్మకం

2023-24 సంవత్సరంలో కొండపి పొగాకు బోర్డులో మొత్తం అమ్మకాలు 16.58 మిలియన్లు పొగాకు అమ్మకాలు జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం ఇంకా అంతకంటే ఎక్కువగా ఉందని బోర్డు అధికారులు తెలిపారు. గత సంవత్సరం సరాసరి రూ.269.98 పలికిందని, అందులో అత్యధిక ధర రూ.362, అత్యల్ప ధర రూ.49 పలికిందన్నారు. అదే విధంగా బ్రైట్ రకం సరాసరి ధర రూ.329.75, మీడియం సరాసరి ధర రూ.311.07, లోగ్రేడు సరాసరి ధర రూ.226.78 పలికింది.

బయట అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

పొగాకు రైతులు తమ పండించిన పొగాకు పంటను వేలం కేంద్రంలోనే అమ్మకాలు జరపాలని, అలా కాకుండా బయట అమ్మకాలు జరిపినట్లు తెలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు. పండుగుల్ల, ఎండుఆకులు, సూర బేళ్లు అవి కూడా వేలం కేంద్రంలో అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. స్టోరేజీలో రైతులు బేళ్లు ఉంచుతున్నారని, స్టోరేజీలో బేళ్లు పెట్టుకొనే ముందు బోర్డు వారి దగ్గరకు వెళ్లి ఎన్ని బేళ్లు ఉంచుతున్నామో తెలపాలన్నారు. అనుమతి లేని బేళ్లను విజిలెన్సు అధికారులు పట్టుకొనే అవకాశం ఉందని తెలిపారు. కావున రైతులు తప్పనిసరిగా స్టోరేజీ బేళ్లను చెందిన రసీదు తీసుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం ఎక్కువ వర్షాలు పడడంతో గ్రామాలలో ముందస్తుగా వేసిన పొగాకు పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పొగాకు పంటను చెడగొట్టి మరలా వేయడం వలన రైతులకు విపరీతంగా ఖర్చులు పెరిగాయన్నారు. అదే విధంగా విపరీతంగా ఖర్చులు కూడా గత సంవత్సరం కంటే ఎక్కువగా పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని బోర్డు వారు సరైన మద్దతు ధరల కల్పించాలని రైతులు కోరుతున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శ్రీహర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం జరిగిన ప్రాంగణ ఎంపికలలో మొత్తం 206 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. చెన్నైకు చెందిన సిఎట్ కంపెనీకి 116 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరి సంవత్సర వేతనం 2.64 లక్షలు ఇవ్వనున్నారు. చెన్నైకు చెందిన వ్యాబ్ కో కంపెనీకి 84 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరి సంవత్సర వేతనం 2.16 లక్షలు,

విద్యార్థులను అభినందిస్తున్న రవికుమార్

ఒంగోలుకు చెందిన చోలాస్ కంపెనీకి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరి సంవత్సర వేతనం 3 లక్షలు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, ఏవో యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇంచార్జ్ ధీరేష్, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ

- రూ 13.71 కోట్లతో 38 ప్రభుత్వ భవనాల ఆధునికీకరణ
- నెలాఖరుకల్లా రూపుదిద్దుకోనున్న వైనం
- సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను ఉన్నత స్థితిలో నిలిపేందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ అభిప్రాయపడ్డారు. జిల్లాలోని 61 సంక్షేమ హాస్టళ్ల లో 38 ప్రభుత్వ భవనాల ఆధునికీకరణ, మరో నాలుగు హాస్టళ్ల నిర్మాణం వంటి అభివద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తిగావించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు. మెరుగైన వసతులు ఏర్పరచి నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించి, ఆహ్లాదకరమైన వాతావరణంలో తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చేలా విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించేలా ఈ ప్రక్రియకు తెర లేపినట్లు ఆయన వివరించారు..

రూ.13.71 కోట్లతో హాస్టళ్ల ఆధునికీకరణ...

జిల్లాలోని 38 సాంఘిక సంక్షేమ ప్రభుత్వ భవనాల ఆధునికీకరణకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధతో రూ 13.71 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో కొండేపి నియోజకవర్గంలో మూడు బాలుర హాస్టళ్లు, ఒంగోలులోని 2 బాలురు హాస్టళ్లు,2 బాలికల హాస్టళ్లు , సంతనూతలపాడు నియోజకవర్గంలో 4 బాలుర హాస్టళ్లు, దర్శి నియోజకవర్గంలో 4 బాలుర హాస్టళ్ల తో పాటు 1 బాలికల హాస్టల్, ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 2 బాలుర హాస్టళ్లు, ఒక బాలికల హాస్టల్, కనిగిరి నియోజకవర్గంలో 4 బాలుర హాస్టళ్లు ,1 బాలికల హాస్టల్ తో పాటు మరో బాలికల కళాశాల హాస్టల్,, గిద్దలూరు నియోజకవర్గంలో 5 బాలుర హాస్టళ్ళ తో పాటు 1 బాలుర కాలేజీ హాస్టల్, మరో 2 బాలికల హాస్టళ్లు, మార్కాపురం నియోజకవర్గంలో 3 బాలుర హాస్టల్స్ 2 బాలికల హాస్టళ్ల కు ఈ నిధుల ద్వారా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ హాస్టళ్ల ప్రాంగణాల్లో అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పనున్నట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తి ప్రతి ఒక్క విద్యార్థి కి అలవడేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని వివరించారు

రూ 5.50 కోట్లతో హాస్టల్ నిర్మాణం

జిల్లాలో ఏకైక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అనుబంధంగా రూ.5.50 కోట్లతో జి ప్లస్ త్రీ పద్ధతిన నూతన హాస్టల్ భవన నిర్మాణానికి మంత్రి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేశారన్నారు. తద్వారా 550 మందికి పైగా విద్యార్థులు నివాసముండి డిగ్రీ, పీజీ వంటి ఉన్నత చదువులు చదువుకునేందుకు సౌలభ్యం చేకూరుతుందని తెలిపారు. సంతపేటలోని బాలికల హాస్టల్ పాత భవన స్థానంలో రూ 6.50 కోట్లతో నూతన భవనం నిర్మాణం చురుకుగా సాగుతున్నట్లు వివరించారు.

రూ.4 కోట్లతో మరో 2 హాస్టళ్లు..

సంతనూతలపాడు నియోజకవర్గంలో చీమకుర్తిలో బాలికల హాస్టల్ నూతన భవనానికి రూ రెండు కోట్లు, సంతనూతలపాడులో బాలుర హాస్టల్ భవనానికి మరో రెండు కోట్లు నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు వివరించారు. 38 హాస్టళ్ల ఆధునికీకరణ పనులు నెలాఖరు కల్లా పూర్తయి కొత్త సొబగులు సంతరించుకుంటాయన్నారు..

ఇంటర్ లో ఉత్తమ ఫలితాలు సాధన దిశగా.

ఈ ఏడాది ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా 911 పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన ఆల్ - ఇన్ - వన్ మెటీరియల్ అందించామన్నారు. అంతే గాకుండా పదవ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అవసరమైన చోట ట్యూటర్లను కూడా నియమించామని చెప్పారు. ఈ ఏడాది 100% ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.